క్లుప్తంగా

విద్యాహక్కు చట్టం అమలుకు కృషి



ఎస్‌ఎఫ్‌ఐ మండల నూతన కమిటీ సభ్యులతో జిల్లా కార్యవర్గ సభ్యులు

కిర్లంపూడి: విద్యాహక్కు చట్టం అమలుకు కృషి చేస్తున్నట్టు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీకాంత్ తెలిపారు. స్థానిక ఏఎస్‌ఎల్ పాఠశాలలో శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల నూతన అధ్యక్షుడిగా రౌతు నాని, కార్యదర్శిగా కీర్తి మణికంఠ, జాయింట్ సెక్రటరీలుగా మోహన్, సతీష్, మనోజ్, పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిద్ధు, నరసింహమూర్తి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాకినాడ ఆసుపత్రిలో నాగేశ్వరరావును పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం పరామర్శించారు. ధర్మవరానికి చెందిన దువ్వాడ నాగేశ్వరరావు కాకినాడలోని అపోలో హాస్పిటల్, బుర్ర నాగేశ్వరరావు అహోబిలా సూపర్ స్పెషలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. మురళీకృష్ణంరాజు ఆయా ఆస్పత్రులకు వెళ్లి బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దోమలంక బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జైఆంధ్ర సమాచార హక్కు సంఘం జిల్లా అధ్యక్షుడిగా నగేష్



గోకవరం: జైఆంధ్ర జైభారత్ సమాచార హక్కు సంఘం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా గోకవరానికి చెందిన జేయస్ నగేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బి.జయప్రకాష్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందుకున్నారు. అవినీతి, అసంఘటిత కార్యక్రమాలు, పేదలకు సామాజిక న్యాయం తదితర అంశాలపై జైఆంధ్ర సమాచార హక్కు సంఘం నిరంతరం పోరాడుతుందని నగేష్ తెలిపారు.

పింఛన్ల పంపిణీలో ద్వితీయస్థానం

తుని రూరల్: పింఛన్ల పంపిణీలో తుని మండలం జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ తెలిపారు. శుక్రవారం ఎస్.అన్నవరంలో పింఛన్ల పంపిణీని స్థానిక నాయకులతో కలసి ఆయన ప్రారంభించారు. మండలంలో 27 గ్రామ సచివాలయాల్లో 12261 మంది లబ్ధిదారులు ఉండగా సాయంత్రం ఆరుగంటలకు 11493 (93.74 శాతం) మందికి రూ.4.98 కోట్లు అందజేశామన్నారు. ప్రథమస్థానంలో గొల్లప్రోలు అర్బన్ ఉండగా రెండో స్థానంలో తుని మండలం నిలిచినట్టు ఆయన తెలిపారు. శనివారం వందశాతం మందికి పింఛన్లు అందజేస్తామన్నారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, పీఏసీఎస్ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, బోడిశెట్టి గణేష్, పాల్గొన్నారు.

పేకాడుతున్న ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4,350 స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలి

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురం కేంద్రంగా ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలని గిరిజన యువ సంఘం అధ్యక్షుడు లోతా రామారావు, సర్పంచ్ గుండు చెంచుబాబు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పి.మల్లాపురంలో గిరిజన గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటనందూరు, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి నాలుగు మండలాల్లో 59 గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. ఆ గ్రామాలను కలిపి గిరిజన మండలం ఏర్పాటు చేయాలన్నారు. గిరిజనులు వెనుకబడి ఉన్నారని, వారికి ప్రభుత్వ ఫలాలు అందడం లేదన్నారు. ఈ నాలుగు మండలాల గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించడం లేదన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు పాల్గొన్నారు.

వరివడిగా నాట్లు

- మెట్టలో ఖరీఫ్ పనులు ప్రారంభం
- లోటు వర్షంతో రైతులకు తప్పని తిప్పలు
- సాగు లక్ష్యం 15124 హెక్టార్లు
- నాట్లు వేసింది 136 హెక్టార్లలోనే..



తిరుమాలిలో వరినాట్లు వేసిన పొలం



డి.పోలవరంలో సాగునీరు లేక బీడువారుతున్న నారప్ప చెరువు ఆయకట్టు



ఏలేశ్వరంలో నాట్లు వేస్తున్న కూలీలు

తుని రూరల్/ఏలేశ్వరం: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఖరీఫ్ వరినాట్లు ఎట్టకేలకు మొదలయ్యాయి. బోరుబావులు ఆధారంగా, తాండవ, పంపా రిజర్వాయర్ల ఆయకట్టులో రైతులు నాట్లు వేస్తున్నారు. తాండవ, పంపా, ఏలేరు జలాశయాల్లో పూర్తిస్థాయిలో సాగునీటి నిల్వలు లేకపోవడం, సాధారణ వర్షపాతాలు నమోదు కాకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆలస్యమైంది. సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా మెట్ట ప్రాంతంలో వరినాట్లు పడలేదు. పుష్కర ఎత్తిపోతల నుంచి ఏలేరు, పంపా రిజర్వాయర్లకు నీరు మళ్లిస్తుండగా 380 గరిష్ట నీటిమట్టం గల తాండవ రిజర్వాయర్‌లో 370.8 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. ఐదు మండలాల్లో సాధారణ ఖరీఫ్‌లో సాధారణ వరిసాగు 15234 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 136 హెక్టార్లలో వరినాట్లు వేసినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ నెలాఖరుకు వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని ఇన్‌చార్జ్ ఏడీఏ చంద్రశేఖర్ తెలిపారు.

తుని మండలంలో రెండు హెక్టార్లలోనే..

తుని మండలంలో 1521 హెక్టార్లలో వరినాట్లు వేయాల్సి ఉండగా సుభద్రయ్యమ్మపేటలో రైతులు బోరుబావులు ఆధారంగా రెండు హెక్టార్లలో నాట్లు వేశారు. మండలంలో శివారు భూములకు పంపా రిజర్వాయర్, పుష్కర కాలువ, వర్షాధారంపై రైతులు వరిసాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు పంపా, పుష్కర నుంచి సాగునీరు చేరకపోవడంతో ఆయకట్టులో రైతులు నాట్లు వేయలేదు. భూములు బీడువారుతున్నాయి.

పంపా, పీబీసీ పరిధిలో..

తొండంగి మండలానికి ప్రధానంగా పంపా, ఏలేరు రిజర్వాయర్లు, పీబీసీ, పుష్కర కాలువలు, వర్షాధారంగా సాగునీరు అందాల్సి ఉంది. ఇటీవలే పంపా నుంచి నీరు విడుదల చేయడంతో ఇప్పుడిప్పుడే నాట్లు వేస్తున్నారు. మండలంలో 5193 హెక్టార్లకు 43 హెక్టార్లలో నాట్లు వేశారు. కోటనందూరు మండలంలో తాండవ రిజర్వాయర్, విద్యుత్ బోరుబావులు, వర్షాధారంగానే రైతులు వరినాట్లు వేస్తారు. తాండవ నుంచి సాగునీరు విడుదలైతే రెండు వారాల్లో వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం 4023 హెక్టార్లలో నాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 62 హెక్టార్లలో నాట్లు వేశారు. రౌతులపూడి మండలానికి తాండవ రిజర్వాయర్, బోరుబావులు, వర్షాధారంగా సాగునీరు లభించనుంది. 2066 హెక్టార్లలో సాధారణ వరిసాగు జరగాల్సి ఉండగా ఇప్పటికి 20 హెక్టార్లలో నాట్లు వేశారు. తాండవ నీటి విడుదల, భారీ వర్షాలు కురిస్తేనే పూర్తిస్థాయిలో నాట్లు పడేఅవకాశం ఉంది. శంఖవరం మండలంలో రైతులు పీబీసీ, పుష్కర కాలువలు, పంపా రిజర్వాయర్, వర్షాధారంగా వరిసాగు చేస్తున్నారు. మండలంలో 1111 హెక్టార్లలో సాధారణ వరిసాగు జరుగుతుండగా ఇప్పటి వరకు తొమ్మిది హెక్టార్లలో నాట్లు వేసినట్టు అధికారులు తెలిపారు.

లోటు వర్షపాతం నమోదు

వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్‌లో ఐదు మండలాలు ఉన్నాయి. తుని, శంఖవరం మండలాల్లో లోటు వర్షపాతం నమోదవ్వగా, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలు కురిస్తేనే వరిసాగుకు మేలు చేస్తుందని, ఇప్పటి వరకు కురిసిన వర్షాలు వల్ల ఎటువంటి ప్రయోజనంలేదని రైతులు పేర్కొన్నారు. ఇంకా వర్షాలు పడతాయన్న ఆశతో రైతులు ఉన్నారు.

తుని వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ వరి సాగు, ఇప్పటి వరకు వేసిన నాట్ల వివరాలు (హెక్టార్లలో)

మండలం	సాధారణ వరిసాగు	నాట్లు వేసినది
తుని	2731	2
తొండంగి	5193	43
కోటనందూరు	4023	62
రౌతులపూడి	2066	20
శంఖవరం	1111	9

ప్రత్తిపాడు నియోజకవర్గంలో...

ప్రత్తిపాడు నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 22 వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు చేయనున్నారు. గతకొన్ని రోజులుగా వర్షాలు ఆశించిన స్థాయిలో ఉండడంతో నాట్లు వేగవంతం చేశారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు అంతంతమాత్రంగా ఉండడంతో సాగు ఆలస్యమైంది. దీంతో సమయానికి పంట దిగుబడికి వచ్చేలా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. మండలంలోని ఏలేశ్వరం, తిరుమాలి, లింగంపర్తి, యర్రవరం, సిరిపురం, తదితర గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

రైతులకు సూచనలు

రైతులు పెట్టుబడి తగ్గించుకొనేందుకు వెదజల్లు విధానాన్ని పాటించాలని, డ్రమ్ముసీడర్ వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీనిద్వారా పెట్టుబడి తగ్గడంతో పాటు పదిరోజుల ముందే పంట చేతికి వస్తుందని చెబుతున్నారు. రైతులు ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎరువులను అధికధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను అధికారులు హెచ్చరిస్తున్నారు. వరినారుకు తెగుళ్లు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

అందుబాటులో ఎరువులు



ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాం. బఫర్ నిల్వలు ఉన్నాయి. దమ్ములో డీఏపీ ఎరువు వేయడం మంచిది. పంపా నుంచి ఆయకట్టుకు నీరు విడుదలైంది. తాండవ రిజర్వాయర్ నుంచి ఈ నెల 15న నీరు విడుదలవుతుంది. వర్షాలు కురిస్తే సమృద్ధిగా సాగునీటి నిల్వలు అందుబాటులోకి వస్తాయి. తుని మండలం డి.పోలవరం, కోటనందూరు మండలం అల్లిపూడి, కేఈ చిన్నయ్యపాలెం, కోటనందూరు గ్రామాలు, తొండంగి మండలంలో నాట్లు వేస్తున్నారు. వారంలో వరినాట్లు ముమ్మరమవుతాయి. ఇటీవల కురిసిన వర్షాలతో నారుమడులు తేరుకున్నాయి.

– కేజే చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఏడీఏ, తుని

చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం



కోదాడలో చంద్రబాబు మోసాలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న యనమల కృష్ణుడు, పార్టీ నాయకులు



వల్లూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఎన్నికలకు ముందు ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ నాయకుడు యనమల కృష్ణుడు అన్నారు. మండలంలోని కోదాడలో శుక్రవారం 'బాబూ ష్యూరిటీ–మోసం గ్యారంటీ'కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధిని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో జరిగిన మోసాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొయ్యా మురళి, మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్, రాష్ట్ర బూత్ కన్వీనర్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బెక్కం చంద్రగిరి, జిల్లా కమిటీ కార్యదర్శి సాపిశెట్టి చిన్న, పార్టీ నాయకులు బూర్తి నాని, బూర్తి విక్టర్‌బాబు, దడాల సూరిబాబు, మల్లవరపు అబ్రహం, పులుగు సింహాచలం పాల్గొన్నారు.

తుని రూరల్: సీఎం చంద్రబాబు నమ్మించి ప్రజలను మోసం చేయడం, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు ఆధ్వర్యంలో కొత్త సూరవరం, మాజీ వైస్ ఎంపీపీ కుర్ర బాబ్జి ఆధ్వర్యంలో వల్లూరు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లంక కృపానందం ఆధ్వర్యంలో లోవకొత్తూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందో వివరించారు. వల్లూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాన్ని ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. నమ్మిఓట్లేసిన ప్రజలను వెన్నుపోటు పొడవడంలో బాబు దిట్ట అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు పెదకాపు తాతారావు, నాయకులు సకురు నాగేంద్రనెహ్రూ, కుర్ర పుల్లయ్య, లంక సత్తిబాబు, కీర్తి రాఘవ పాల్గొన్నారు.

డప్పు, చర్మకారులకు కొరవడిన సంక్షేమం

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ



ఐక్యత చాటుతున్న మాదిగ దండోర నాయకులు

తుని రూరల్: ఎస్సీ వర్గీకరణ జరిగినా రాష్ట్రంలో డప్పు, చర్మకారులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదని ఎంపీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తుని మండలం లోవకొత్తూరులో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ పలివెల శివమణి ఆధ్వర్యంలో మాదిగల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిందని, మాదిగల చిరకాల స్వప్నం నెరవడంతో ప్రతి సంవత్సరం ఈ రోజు జడ్జిమెంట్ డే నిర్వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డప్పు, చర్మకారులకు ఎటువంటి పింఛన్లు, ఇళ్లస్థలాలు ఇవ్వలేదన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ శివమణి మాట్లాడుతూ డప్పు కళాకారులకు మూడు ఎకరాల భూమి, రంగస్థల కళాకారులకు ఇస్తున్నట్టే డప్పు కళాకారులకు రూ.ఏడు వేలు పింఛన్, డప్పు, గజ్జెలు, దుస్తులు మాదిగ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుని నియోజకవర్గ అధ్యక్షుడు కె.ముసలయ్య, కార్యదర్శి దూలపల్లి చిన్న, తుని టౌన్ అధ్యక్షుడు కాకాడ జ్యోతికుమార్, నాయకులు తాతపూడి చరణ్, ఇందుగపల్లి రవికుమార్, ఆరుగుల రాజబాబు పాల్గొన్నారు.

సమాజ సేవే పరమావధి



శ్రీప్రకాష్ రోటరాక్ట్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు

తుని: సమాజ సేవే పరమావధిగా రోటరాక్ట్ క్లబ్ పని చేస్తోందని ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కల్యాణ్ చక్రవర్తి అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ యంగ్ లీడర్స్, సబల డిస్ట్రిక్స్ 3020 నూతన కార్యవర్గం ఎన్నిక అట్టహాసంగా జరిగింది. చంద్రవర్ధన్, అనురాధ క్లబ్ నూతన అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ యువతను సమాజసేవలో మమేకం చేయడమే లక్ష్యంగా రోటరాక్ట్ క్లబ్‌లను ప్రోత్సహిస్తున్నామన్నారు. శ్రీప్రకాష్ సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లడుతూ రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులు రక్తదాన శిబిరాల ద్వారా 2,400 యూనిట్ల రక్తాన్ని బ్లడ్ బ్యాంకులకు అందజేసారని తెలిపారు. కార్యక్రమంలో రోటరాక్ట్ డిస్ట్రిక్ట్ కమిటీ కో చైర్మన్ నాగసురేష్, కేదారిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ



వెండి, బంగారు ఆభరణాల అలంకారంలో కనకదుర్గమ్మ

గోకవరం: పవిత్ర శ్రావణ మాసంలో రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని గోకవరం దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మ భక్తులకు వరలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బీమాపై ప్రజలకు అవగాహన

శంఖవరం: ప్రమాదాల బారిన పడిన కుటుంబాలకు బీమా సొమ్ము అండగా నిలుస్తుందని స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ జి.సాయిమనోజ్ అన్నారు. మండలంలోని ఎస్.జగ్గంపేటలో ప్రజలకు శుక్రవారం బీమాపై అవగాహన కల్పించారు.

దివ్యాంగ అక్కాచెల్లెళ్లకు వీల్‌చైర్ అందించాలి

- అధికారులకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



దివ్యాంగ చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం: మండలంలోని గుమ్మల్లదొడ్డి గ్రామానికి చెందిన దివ్యాంగ అక్కాచెల్లెళ్లు ఎ.విజయ సరస్వతి, ఎ.నాగసాయిలకు వీల్‌చైర్ అందించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో భాగంగా శుక్రవారం కలెక్టర్ గ్రామంలో పర్యటించారు. పలువురు లబ్ధిదారులు, దివ్యాంగ అక్కాచెల్లెళ్లకు వారి ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేశారు. దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా పిల్లలకు వీల్ చైర్ సదుపాయం కల్పించాలని తల్లితండ్రులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వీరికి వీల్‌చైర్ సదుపాయం కల్పించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. పిల్లల ఆరోగ్య స్థితిపై తగిన వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 2,36,331 మంది లబ్ధిదారులకు రూ.103.26 కోట్లు పంపిణీ చేయడానికి ఏర్పాటు చేయగా శుక్రవారం మధ్యాహ్నం నాటికి 91.72 శాతం మందికి ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ముద్రగడ త్వరగా కోలుకోవాలని పూజలు



శరభవరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు




కిర్లంపూడిలో దుర్గమ్మకు సహస్ర కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఏనుగువీధి రామాలయం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దుర్గమ్మకు విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, లలితా పారాయణ, లక్ష్మీఅష్టోత్తర పూజలు నిర్వహించారు. జగపతినగరంలో వేంచేసిన అభయదుర్గమ్మ ఆలయంలో అడపా ఏడుకొండలు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతల స్వరూపంగా భావించి 11 మంది మహిళలకు చీర, జాకెట్, పసుపు, కుంకుమ, పండ్లు, పూలు అందజేశారు.

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రౌతుపాలెంలోని సాయిబాబా మందిరం, శరభవరం కనకదుర్గమ్మ ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ చిన్నారి ఈశ్వరరావు, లింగంపల్లి వెంకటేశ్వరరావు, లింగంపల్లి మాధవ, సమ్మిటి సత్తిబాబు, లింగంపల్లి చంటిబాబు రామిశెట్టి దొరబాబు, గువేరా, అమరాధికాశి, అటికే సత్యనారాయణ, దూళ్ల నాగ సూర్యం, రామిశెట్టి తమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చెన్నకేశవరావు

కోటనందూరు: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు సూచించారు. స్థానిక శ్రీసాయి జూనియర్ కాలేజీ, జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చెన్నకేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితాన్ని సర్వనాశనం చేసే మత్తు పదార్థాల జోలికి పోకూడదన్నారు. సైబర్‌నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

నంబర్‌ప్లేట్లు లేని వాహనాలకు జరిమానా

స్థానిక బస్టాండు సెంటర్లో శుక్రవారం సాయంత్రం ఎస్సై రామకృష్ణ వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన రిజిస్ట్రేషన్ నంబర్‌ప్లేట్లు లేని 10 మోటార్ వాహనాలను అదుపులోకి తీసుకొని జరిమానా విధించారు. కార్లపై నల్ల అద్దాలు వినియోగించరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



మన్యవారిపాలెంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ



డి.పోలవరంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీలత

ప్రత్తిపాడు: పుట్టిన బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమైనవని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యులు, నర్సులు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సౌమ్యమైఖేల్ ర్యాలీని ప్రారంభించారు. తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. తల్లి పాలు ముద్దు – డబ్బా పాలు వదు అంటూ నినాదాలు చేశారు. అనంతరం సీహెచ్‌సీలో సీమాంక్ సెంటర్‌లో తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.

తుని రూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని తుని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. శుక్రవారం డి.పోలవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు తాగించాలన్నారు. ఆరు నెలలు వరకు తప్పనిసరిగా తలిపాలు ఇవ్వాలని, ఆ తర్వాత అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. అనారోగ్యానికి గురవుతామన్న అపోహతో కొంతమంది తల్లులు పిలల్లలకు పాలు ఇవ్వడంలేదన్నారు. అటువంటి అపోహలను నమ్మొద్దన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, అరుణ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలు పాల్గొన్నారు.



కత్తిపూడిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాలు ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు.

తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలి

జగ్గంపేట: తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని, తల్లిపాలు ప్రాముఖ్యత పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని జగ్గంపేట, మన్యవారిపాలెం గ్రామాల్లో తల్లులకు తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లి పాలు ప్రాముఖ్యతను వివరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో శుక్రవారం హైమ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మణికుమారి ప్రారంభించారు. వైద్య సిబ్బంది సుమారు 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కంటిలో శుక్లాలు కలిగిన 12 మందిని గుర్తించారు. వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తారని సర్పంచ్ మణికుమారి తెలిపారు. కార్యక్రమంలో పి.దొరబాబు, వసీన్, చెక్కపల్లి మందేశ్వరరావు, బూరయ్య, శెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ 7వ సంచిక విడుదల

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫోరెన్సిక్ కళాశాలకు చెందిన ఫోరెన్సిక్ 7వ సంచికను కాకినాడ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) దేవరాజ్ పాటిల్ శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తుషార్ కేసి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

కోటనందూరు: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ఏఈఓ పి.జగ్గప్పారావు సూచించారు. పొలం పాలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కేఎస్ కొత్తూరు, సంగవాక గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగులు, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాలు సాగుతో మంచి ఆదాయం వస్తుందన్నారు. 50 శాతం రాయితీతో చిరుధాన్యాల విత్తనాలు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.